క్లుప్తంగా

జీపీ భవనానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న నాయకులు

దౌల్తాబాద్: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నాయకుడు వీరన్న మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేస్తున్నారని అన్నారు. అలాగే మండలంలో అన్ని గ్రామాల్లో రోడ్లు, పాఠశాల భవనాలు, పంచాయతీ భవనాలు మంజూరు అయ్యాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాములు, నాయకుడు నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

కమిటీలతో ఎమ్మార్పీఎస్ బలోపేతం



గ్రామ కమిటీ సభ్యులతో ఎమ్మార్పీఎస్ నాయకులు

యాలాల: గ్రామ కమిటీలతో ఎమ్మార్పీఎస్ మరింత బలోపేతం కానుందని సంస్థ మండల ఇన్‌చార్జి మెట్లి సూర్యప్రకాష్ అన్నారు. సోమవారం యాలాల గ్రామంలో గ్రామ కమిటీని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ సాధన ఎమ్మార్పీఎస్‌తో సాధ్యమయిందన్నారు. దీనికి మంద కృష్ణమాదిగ విశేష కృషి చేశారన్నారు. అనంతరం యాలాల గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మలిగేరి నర్సింహులు, అధికార ప్రతినిధిగా కొప్పుల యాదప్ప, ఉపాధ్యక్షుడిగా కొప్పుల నర్సింహులు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీను, నర్సింహులు, శివకుమార్, చిన్నయ్య, రమేష్, శ్రీనివాస్, హన్మంతు తదితరులు ఉన్నారు.

ఎంపీడీఓకు సన్మానం



వినోద్‌గౌడ్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

బొంరాస్‌పేట: ఇటీవల బదిలీపై వచ్చిన ఎంపీడీఓ వినోద్‌గౌడ్ సోమవారం పదవీ విరమణ పొందారు. ఈ మేరకు సూపరింటెండెంట్ వెంకన్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శులు ఆయన్ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుదీర్ఘకాలం సేవలందించిన వినోద్‌గౌడ్‌ను పలువురు కొనియాడారు. ఇప్పటి నుంచి ఇన్‌చార్జి ఎంపీడీఓగా వెంకన్‌గౌడ్ వ్యవహరించనున్నారు.

మొక్కలు నాటిన నాయకులు



మొక్క నాటి నీరు పోస్తున్న నాయకులు

బషీరాబాద్: మండల కేంద్రంలోని నావంద్గీ సొసైటీ కార్యాలయం ఆవరణలో సోమవారం చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో డైరెక్టర్లు, నాయకుల మొక్కలు నాటి నీరు పోశారు. జిల్లా సహకార సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రతిఒక్కరూ తమ తల్లిదండ్రుల పేరు మీద మొక్కలు నాటాలని, పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, చందర్, హన్మంతు, సీఈఓ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న కర్ణాటక మాజీ మంత్రి అరవింద్ లింబావళి

తాండూరు రూరల్: మండలంలోని కొత్లాపూర్ రేణుక ఎల్లమ్మ ఆలయంలో కర్ణాటక మాజీ మంత్రి అరవింద్ లింబావళి ప్రత్యేక పూజలు చేశారు. మూడు రోజుల పాటు జరిగే హోమాన్ని సోమవారం కేరళ పూజారులు నిర్వహించారు. మాజీ మంత్రి ఇంటి దేవత ఎల్లమ్మ కావడంతో ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారంతో పూజలు ముగుస్తాయని ఆలయ చైర్మన్ నవీన్‌రెడ్డి తెలిపారు.

వర్షాకాలం.. పశువులు భద్రం

- పచ్చిగడ్డి మేతతో గొంతువాపు
- మూగజీవాలకు సీజనల్ వ్యాధుల ముప్పు
- ముందస్తు వ్యాక్సిన్ తప్పనిసరి అంటున్న పశువైద్యాధికారులు



ఆలేడ్ చెరువు పరిసరాల్లో మేస్తున్న జీవాలు

దుద్యాల్: మానవులకే కాదు పశువులకు కూడా సీజనల్ వ్యాధుల గండం పొంచి ఉంది. వర్షాకాలం తొలకరి ప్రారంభమై అడపాదడపా కురుస్తున్న వానలకు బీడు భూముల్లో పచ్చి గడ్డి పెరుగుతుంది. పశువులు ఎంతో ఇష్టంగా పచ్చి గడ్డిని మేస్తుంటాయి. తొలకరి చినుకులకు మొలకెత్తిన గడ్డిలో బాక్టీరియాలు ఉండే అవకాశం ఉంది. దీంతో వాటిని మేసిన పశువులు, మేకలు, గొర్రెలకు ఆరోగ్యం దెబ్బతింటుంది. ఈ బాక్టీరియా కలిగిన పచ్చిగడ్డిని తినడంతో గొంతువాపు వ్యాధి సోకే ప్రమాదం ఉందని పశువైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం గడ్డి ఎక్కువగా మొలకెత్తింది. ఇందులో ఉండే బాక్టీరియా కారణంగా గొంతువాపు వ్యాధి సంక్రమించే అవకాశం ఉంది. ఈ వ్యాధి ప్రభావం తీవ్రత ఎక్కువైతే పశువులు మృత్యువాత పడే అవకాశాలున్నాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో పశుపోషకులు కలవరపాటుకు గురవుతున్నారు. గొంతువాపు వ్యాధి సోకిన పశువులకు 104 కంటే అధిక డిగ్రీల జ్వరం ఉంటుందని, నిర్లక్ష్యం వహిస్తే వారంలోపై మృత్యువాత పడే అవకాశం ఉందని పశువైద్యులు తెలియజేస్తున్నారు.

వ్యాధి వ్యాప్తి ఇలా..

గొంతువాపు వ్యాధి ప్రధానంగా గేదెలు, దున్నల్లో ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఆవులు, దూడల్లో కాస్త తక్కువగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గినప్పుడు, వర్షంలో తడిసినప్పుడు, ఎండి గడ్డితో పాటు పచ్చిగడ్డి మేసిన పశువులకు ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంటుంది. బురద ప్రదేశాల్లో తిరిగినప్పుడు వ్యాధి మరింతగా వేగంగా వ్యాపిస్తుంది. వ్యాధి సోకిన పశువులు మేత కూడా సరిగా మేయవు. నీరసించి కనిపిస్తాయి.

మండలంలో పశువుల వివరాలు	
ఆవులు, ఎద్దులు	3,785
గేదెలు	3,486
గొర్రెలు	3,774
మేకలు	7,155

ముందస్తు వ్యాక్సిన్ మేలు



పశువులు, జీవాలకు సీజనల్ వ్యాధులు సోకే అవకాశాలున్నాయి. వ్యాధి సోకిన పశువులు అధికంగా జ్వరంతో సొమ్మసిల్లుతాయి. నడక, మేత మేయడంలో నిర్లక్ష్యంగా ఉంటాయి. అలాంటి వాటిని వెంటనే గుర్తించి పశువైద్యులను సంప్రదించాలి. లేదంటే వాటి ప్రాణాలకే ప్రమాదం. ముందస్తుగా గొంతువాపు వ్యాధి నివారణకు సంబంధించిన టీకాలు వేయించుకుంటే మరింత మంచిది.

– వెంకటయ్య, పశువైద్యాధికారి, దుద్యాల్



బురాన్‌పూర్-మదన్‌పల్లి రహదారిలో ప్రమాదకర మలుపు

మలుపు.. ప్రమాదానికి నెలవు!

బొంరాస్‌పేట: మండలంలో పలుచోట్ల రహదారి మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. మండల కేంద్రం నుంచి మదన్‌పల్లి, దుప్‌చర్ల, సాలిండాపూర్, వడిచర్ల, బుర్రితండా రూట్లతోపాటు తుంకిమెట్ల నుంచి బాపల్లి, చౌదర్‌పల్లి, ఏర్పుమళ్ల రూట్లల్లో మలుపులతో కూడిన బీటీ రోడ్లున్నాయి. కనీసం అక్కడ సూచిక బోర్డులు సైతం లేవు. దారి పొడవునా కంప చెట్లు అల్లుకుపోయాయి. కొన్నిచోట్ల మలుపు తిరిగిన స్థలాల్లో మరింత ప్రమాదకరంగా మారాయి. అధికారులు స్పందించి మలుపుల వద్ద సూచికలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నూతన బోరు ఏర్పాటు

కుల్కచర్ల: ప్రజా సంక్షేమమే బీజేపీ ధ్యేయమని పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్ అన్నారు. సోమవారం మండలంలోని రాంరెడ్డిపల్లిలో ఎంపీ నిధులతో గ్రామస్తులకు నూతన బోరును వేయించారు. ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి పేదలకు ఎంతో సహకారం అందిస్తారన్నారు. పార్టీ నేత నరేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

తండాల అభివృద్ధికి చర్యలు

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



యాలాల: రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు

యాలాల: గిరిజన తండాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి చెప్పారు. సోమవారం మండలంలోని పగిడిపల్లి నుంచి పటేల్‌చింతతండా వరకు బ్రిడ్జితో పాటు బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తండా ప్రజల విజ్ఞప్తి మేరకు బీటీ రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. రూ.1.85 కోట్లతో చేపట్టనున్న బ్రిడ్జి, రోడ్డు పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తామన్నారు. అనంతరం తండాకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, డైరెక్టర్ రాజు, పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, మాజీ అధ్యక్షుడు భీమప్ప, నాయకులు అమృతప్ప, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

రూ.450 కోట్లతో అభివృద్ధి పనులు

బషీరాబాద్: తాండూరు నియోజకవర్గంలో రూ.450 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తెలిపారు. సోమవారం నీళ్లపల్లి ఏకాంబరి రామలింగేశ్వర ఆలయ ప్రధాన ద్వారం నుంచి ఆలయం వరకు రూ.95 లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 18 నెలల ప్రభుత్వ కాలంలో భారీ ఎత్తున నిధులు రాబట్టి గ్రామాల్లో రూ.15 లక్షల నుంచి రూ.60లక్షల వరకు అభివృద్ధి పనులు చేశామన్నారు. బషీరాబాద్‌లో కళాశాల ఏర్పాటు చేసి తరగతులను ప్రారంభించినట్లు చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆస్పత్రిగా మార్చి సేవలందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, సొసైటీ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి, వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, నాయకులు వెంకటేశ్‌మహరాజ్, శంకరప్ప, రామ్ నాయక్, శంకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

ఏఈఓ శిరీష



రైతులతో సమావేశమైన ఏఈఓ శిరీష

యాలాల: భూమి ఉన్న ప్రతి ఒక్కరూ ఫార్మర్ రిజిస్ట్రీని తప్పనిసరిగా చేసుకోవాలని రాస్నం క్లస్టర్ ఏఈఓ శిరీష సూచించారు. ఈ విషయమై రైతులకు అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ సంక్షేమ పథకాలు అందాలన్నా, రైతుగా గుర్తింపు ఉండాలన్నా, రైతు నమోదు సంఖ్య తప్పనిసరి అని పేర్కొన్నారు. ఇందుకుగాను భూమి ఉన్న కర్షకులు తమ పట్టా పాసుపుస్తకం, ఆధార్, సెల్ నంబరుతో ఏఈఓలను సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్‌లో ఏఈఓ పొందుపరిచిన సమాచారంతో సెల్ నంబరుకు వచ్చే ఓటీపీ ప్రక్రియ పూర్తి కాగానే ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తవుతుందన్నారు. ఈ ప్రక్రియ అనంతరం సెల్ నంబరుకు వచ్చే గుర్తింపు సంఖ్యతో మీసేవ కేంద్రాల్లో గుర్తింపు కార్డు పొందవచ్చని పేర్కొన్నారు. రైతులు తప్పక ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఈ సందర్భంగా ఏఈఓ శిరీష కోరారు.

స్థానిక పోరులో సత్తా చాటాలి



నర్సింహారెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న గోపాల్

అనంతగిరి: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని బీఆర్‌ఎస్ పార్టీ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు గోపాల్ అన్నారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని 3వ వార్డులో పార్టీ కమిటీ ఏర్పాటు చేశారు. వార్డు అధ్యక్షుడిగా నర్సింహారెడ్డిని ఎన్నుకున్నారు. అనంతరం గోపాల్ మాట్లాడుతూ.. మున్సిపల్‌లో పార్టీ బలంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తామన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతామన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అనంత్‌రెడ్డి, నాయకులు శేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గోపి, షఫీ, వెంకటేష్, నర్సింలు, సిరాజ్, మహ్మద్, దశరథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకు విశ్రాంత జీవితం



బాలేశ్వరయ్యను సన్మానిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

మోమిన్‌పేట: ఉద్యోగులు విశ్రాంత జీవితాన్ని సమాజ సేవకు వినియోగించాలని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల పరిధిలోని వెల్‌చాల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలేశ్వరయ్య పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో ఒకప్పుడు ఉపాధ్యాయులకు ఎంతో గౌరవ మర్యాదలు ఉండేవన్నారు. ప్రస్తుతం అలాంటి ధోరణి కనుమరుగవుతుందన్నారు. గురువులు విశ్రాంత జీవితాన్ని సమాజ శ్రేయస్సుకు ఉపయోగించాలని సూచించారు. అంతకుముందు పూలమాల వేసి సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ మల్లేశం, ఉపాధ్యాయులు అరుణ్‌కుమార్, రమేశ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, సమద్, పీఆర్టీయూ సభ్యులు, గ్రామ నాయకులు మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన



కొడంగల్ రూరల్: పర్సాపూర్‌లో ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని పర్సాపూర్ గ్రామంలో సోమవారం లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని అన్నారు. త్వరితగతిన పనులు ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ జయపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కల్పన, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీశైలం, మాజీ ఉప సర్పంచ్ మొగులయ్య, నాయకులు నర్సింలు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణంలో నిర్లక్ష్యం తగదు

దోమ: ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో నిర్లక్ష్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ గ్యామా సూచించారు. సోమవారం మండల పరిధిలోని బాస్‌పల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ అనంతయ్యతో కలసి లబ్ధిదారులకు మంజూరైన ఇళ్లకు ముగ్గు పోసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. అనంతరం ఐనాపూర్‌లో నర్సరీని పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

మాది పేదల ప్రభుత్వం

అనంతగిరి: పేదల సొంతింటి కలను నిజం చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం వికారాబాద్ పట్టణంలోని పలు వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మురళి, నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతు నేస్తం వీసీ

బంట్వారం: రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్(వీసీ) మంగళవారం ఉదయం కోట్‌పల్లి మండలంలోని బుగ్గాపూర్ రైతు వేదికలో ఉంటుందని ఏఈఓ సందీప్ ఓ ప్రకటనలో తెలిపారు. చిరుధాన్యాల సాగులో మెలకువలు తదితర అంశాలపై కాన్ఫరెన్స్‌లో వివరిస్తారని చెప్పారు. రైతులు తప్పనిసరిగా హాజరై చిరుధాన్యాల సాగుకు సంబంధించిన విషయాలను తెలుసుకోవాలని సూచించారు.

చట్టాలపై అవగాహన అవసరం



మోమిన్‌పేట: మల్లారెడ్డిగూడెంలో సమావేశమైన అధికారులు, గ్రామస్తులు



పరిగి: లక్నాపూర్‌లో సమావేశమైన తహసీల్దార్, ఎస్‌ఐ

పరిగి: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ ఆనంద్‌రావు, ఎస్‌ఐ సంతోష్‌కుమార్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని లక్నాపూర్ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరికి హక్కులను కల్పించిందన్నారు. హక్కుల సాధించే దిశగా అందరూ చట్టాలను గౌరవిస్తూ ముందుకు సాగాలన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు తప్పకుండా చట్టాలను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు నివాళి

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని హుస్సేన్‌పూర్ గ్రామంలో సోమవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి కొండయ్య అధ్యక్షతన ఆర్‌ఐ రాఘవేందర్, పోలీసు సిబ్బంది పాల్గొని హక్కుల గురించి వివరించారు. అంతకుముందు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. అంటరానితనం నిర్మూలన తదితర చట్టాలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ హన్మంత్ రెడ్డి, గ్రామస్తులు అంజిల్‌రెడ్డి, ఆశప్ప తదితరులు పాల్గొన్నారు.

పౌరులందరూ సమానమే

మోమిన్‌పేట: దేశంలోని పౌరులందరూ సమానమేనని ఆర్‌ఐ గోవర్ధన్ పేర్కొన్నారు. మండలంలోని మల్లారెడ్డిగూడెంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పించిందన్నారు. అంటరానితనం హేయమైన చర్యగా ప్రభుత్వం భావిస్తుంది. ప్రతిఒక్కరూ గ్రామాల్లో కలిసి మెలిసి జీవించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ భూపాల్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ వెంకటయ్య, వార్డెన్ జైపాల్‌రెడ్డి, కార్యదర్శి ఇందిర, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనపూర్‌లో..

కుల్కచర్ల: చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని ఎస్‌ఐ రమేశ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఘనపూర్ గ్రామంలో గ్రామస్తులకు పౌరహక్కుల దినోత్సవంపై అవగాహన కల్పించారు. మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ భరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.